మాదాపూర్‌లో అమృత సంకల్ప్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనది

మాదాపూర్, జూన్ 13: మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్ సరైన మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాదాపూర్‌లో అమృత సం కల్ప్ పేరిట ఏర్పాటు చేసిన క్లినిక్‌ను వైద్యుడు సురేంద్ర, సీఈఓ శిరీషతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ మానసిక అనారోగ్యం అనేది సమస్య మాత్రమే కాదని, దానిని వెల్‌నెస్ లెన్స్ ద్వారా కూడా చూడాలన్నారు. ఈ మార్పునకు నాయకత్వం వహించడానికి డాక్టర్ సురేంద్ర ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో పాటు ముఖ్యమైనది అన్నారు. భావోద్వేగాన్ని పెంపొందించడంతో పాటు మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే క్లినిక్ యొక్క సమగ్ర విధానాన్ని ఆయన ప్రశంసించారు. అమృత సంకల్ప్ మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజానికి తిరిగి ఇవ్వడం తమ మార్గం అని డాక్టర్ సురేంద్ర అన్నారు.

'గద్దర్ అవార్డులను ఆపాలి'

చిక్కడపల్లి, జూన్ 13: హైకోర్టు నోటీస్‌ని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఆపాలని తెలంగాణ సినిమా వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ మాట్లాడారు. తెలంగాణ సినిమా వేదిక ఆధ్వర్యంలో గద్దర్ అవార్డులను ఆపమని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని, పిటిషన్‌ని స్వీకరించిన కోర్టు, విచారణకు ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వానికి ఏ మాత్రం నైతికత ఉన్నా హైకోర్టులో గద్దర్ అవార్డుల గురించి తేలే దాకా అవార్డులను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర నాయకులు రవి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

16న అప్రెంటిస్ షిప్ మేళా

సిటీ బ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): మల్లేపల్లిలోని ఐటీఐ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని నిజాంకాలేజి గ్రౌండ్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజ్ ఆఫ్ లా లో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో అంతర్జాతీయ సంస్థలు, మహారత్న, నవరత్న, మినీ రత్నతో పాటు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7799472000, 9985490144,9666274708 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి

సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): చింతల్ బస్తీ వద్ద ధ్వంసమైన 300 ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. స్థానికులకు నీటిసరఫరా ఇబ్బంది తలెత్తకుండా వెంటనే మరమ్మతులు పనులు పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరణ చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): నేరేడ్‌మెట్‌ని ప్రభుత్వ డైట్ కళాశాల ఉర్దూ మీడియంలో బోధన, బోధనేతర సిబ్బంది తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ స్టడీస్, ఉర్దూ లాంగ్వేజ్, లలిత కళలు, ప్రదర్శనలు విభాగాల్లో ఒక్కొక్క పోస్టు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ తప్పనిసరిగా ఉండాలని, వయస్సు 65 ఏండ్లకు మించరాదని అన్నారు. వేతనం నెలకు రూ.23,400 ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తులు ఈనెల 19లోపు కళాశాలలో అందజేయాలని వెల్లడించారు.

జీహెచ్ఎంసీలో కొత్తగా బిల్డింగ్ ట్రైబ్యునల్!

రిటైర్డ్ జడ్జిని చైర్మన్‌గా నియమించే అవకాశం

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ వివాదాలు, పరిష్కారానికి బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ ట్రైబ్యునల్ చైర్మన్‌గా జిల్లా రిటైర్డ్ జడ్జిని నియమించనున్నారు. సభ్యులుగా టౌన్ ప్లానింగ్ విభాగంలోని పనిచేసిన రిటైర్డ్ అయిన వ్యక్తిని నియమించనున్నట్లు తెలుస్తున్నది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే ఈ ట్రైబ్యునల్ ఆఫీస్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో టౌన్ ప్లానింగ్ వివాదాలు అధికంగా వస్తున్నాయి. ముఖ్యంగా ప్రజావాణి వేదికగా వచ్చే ఫిర్యాదుల్లో సగ భాగం టౌన్ ప్లానింగ్‌వే ఉంటున్నాయి. వీటికి శాశ్వత పరిష్కారంగా ట్రైబ్యునల్ ఏర్పాటు అవసరం అని భావించి ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

నాలా సమస్యలపై తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

జరుపుతున్న అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాప్రతినిధులకు ప్రజాకోర్టులో భంగపాటు తప్పడం లేదు. ఇందులో భాగంగానే శుక్రవారం యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను నిలదీస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. మౌలక చిల్లా ప్రాంతంలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకోవడానికి తన అనుచరులతో కలిసి వెళ్లారు. కొద్ది రోజులు మా బస్తీల్లో గడిపితే నరకం ఏంటో మీకే తెలుస్తుందంటూ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. రెండు రోజులుగా వస్తున్న వరదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేను ఘొరావ్ చేశారు. వారికి సర్ది చెప్పే ప్రయత్నం ఎమ్మెల్యే చేయగా, అంతలోనే ఆయన అనుచరులు స్థానికులపై తిరగబడి దాడి చేశారు. ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఎమ్మెల్యే సెక్యూరిటీ సిబ్బంది రక్షణగా నిలబడి ఎమ్మెల్యేను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటన గ్రేటర్‌లో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. వర్షాకాల సమస్యల నియంత్రణలో ప్రభుత్వం విఫలం చెందిందని మండిపడ్డారు.

17 నెలలుగా సాగదీత ధోరణి

గ్రేటర్‌లో నాలా అభివృద్ధి పనులపై ప్రజాపాలన ప్రభుత్వం శీతకన్ను వేసింది. గడిచిన 17 నెలలుగా పురోగతిలో ఉన్న ఎస్ఎన్‌డీపీ మొదటి దశ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యపు ధోరణిని అవలంభిస్తున్నది. పురోగతిలో ఉన్న 10 చోట్ల పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా నేటికీ ఎస్ఎన్‌డీపీ పనులు మూడు అడుగులు ముందుకు-ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. చేసిన పనులకు జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించడం లేదని , పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేపడతామంటూ కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. పనులను చకచకా పూర్తి చేసేందుకు అనుకూలమైన ఈ వేసవిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ప్రస్తుతం వర్షాకాలం వచ్చిన దరిమిలా మళ్లీ అదే వరద, ఆదే సమస్య అన్నట్లుగా స్థానికుల్లో ఆగ్రహానికి కారణమవుతున్నది.

బీఆర్ఎస్ హయాంలో 150 కాలనీలకు శాశ్వత పరిష్కారం

బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబరు మాసంలో వరుణుడి బీభత్సం తర్వాత వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని భావించిన ఎస్ఎన్‌డీపీ తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులకు చేపట్టింది. పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.531కోట్లతో 29 ప్రాంతాలలో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. తద్వారా 150 కాలనీలను వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపింది. 43 కిలోమీటర్ల పనుల పూర్తితో ఐదు లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. కానీ ఘనత వహించిన ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతిని పట్టించుకోవడం లేదు..ఇందుకు క్షేత్రస్థాయి పనులే అద్దం పడుతున్నాయి.

ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనుల వివరాలు

వర్క్ స్టేజీ	పనుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)	కిలోమీటర్లలో
పురోగతిలో ఉన్నవి	20	280.16	22.973
ప్రారంభ దశలో ఉన్నవి	11	162.80	16.60
టెండర్ దశలో	6	131.68	12.937
డీపీఆర్ స్టేజీలో	3	93.36	4.887
	40	667.28	57.401

రెండో దశలో..

నాలా అభివృద్ధి పనుల రెండో దశలో 57.401 కిలోమీటర్లలో రూ.667.28 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఎస్ఏఎన్‌సీఐ (స్పెషల్ అసిస్టెంట్స్, స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం) పథకం కింద రూ.250 కోట్లు మాత్రమే విడుదల చేయగా, మిగిలిన నిధులపై స్పష్టత లేదు. నిధుల విడుదల జాప్యం కారణంగా రెండో దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఇక ఓయూ సందర్శన ఈజీ

క్యూఆర్ కోడ్ బేస్డ్ నావిగేషన్ విధానాన్ని ఆవిష్కరిస్తున్న ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్టాత్మక ఓయూను సందర్శించేవారి సౌలభ్యం కోసం ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఓటీబీఐ) ఆధ్వర్యంలో నూతనంగా క్యూఆర్ కోడ్ బేస్డ్ నావిగేషన్ విధానాన్ని రూపొందించారు. దీనిని అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్యాంపస్‌లో వివిధ కళాశాలలు, విభాగాలు, పరిశోధన కేంద్రాలు, కార్యాలయాలు, హాస్టల్స్ కు చేరుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దాదాపు 400 కీలక లొకేషన్లను ఇందులో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. త్వరలోనే రాష్ట్రంలోని 100 గ్రామాల లొకేషన్ లను ఈ విధానంలో పొందపరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్, ఓటీబీఐ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాసాగర్, సలహాదారు ప్రొఫెసర్ హరినారాయణ పాల్గొన్నారు.

లైఫ్ స్టైల్ ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ ప్రారంభం

సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ ప్రపంచానికి నెలవైన లైఫ్ స్టైల్ ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ మొదలుపెడుతోంది. ఇది షాపర్లకు ఫ్యాషన్-ఫార్వర్డ్ ప్రొడక్ట్‌ల వైడ్ రేంజ్‌లపై 50శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. అంతేకాదు, హెచ్డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డ్ ఉన్నవారి కోసం 10శాతం తగ్గింపును అందిస్తుంది. ఈ సీజన్‌లో ఈ ప్రచారం మరింత ఊపందుకొనేలా ప్రత్యేకంగా తమన్నా భాటియాతో జట్టుకడుతోంది.

నగరం నడిబొడ్డున బడికి తాళం

(మొదటిపేజీ తరువాయి)

ఉచితంగా విద్యను అందిస్తున్నారు. 2018లో వామన్ రావు మృతి చెందడంతో స్కూల్ బాధ్యతను అమెరికాలో ఉన్న ఆయన కుమార్తె మాలతి పర్యవేక్షిస్తున్నారు. గతంలో ప్రతి ఏడాది సుమారు 100 మంది విద్యార్థులు అందులో చేరగా, ప్రస్తుతం సుమారు 45 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం స్కూల్‌కు గుర్తింపు తప్పనిసరి అని విద్యాశాఖ అధికారులు చెప్పడంతో నిర్వాహకులు సుశీలా వామన్ రావు ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో సంస్థను రిజిస్టర్ చేసుకున్నారు. ఇదిలా ఉండగా, పలువురు కాంగ్రెస్ నేతలు పంజాగుట్ట బస్తీ కమిటీ పెద్దలను రెచ్చగొట్టి, స్కూల్ నిర్వాహకులపై వాగ్వాదానికి పంపించినట్లు సమాచారం. తమ బస్తీ అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో స్కూల్ ఉండొద్దని హెచ్చరించారు. తమకు అనుకూలమైన చోటు దొరికితే ఖాళీ చేస్తామని స్కూల్ నిర్వాహకులు సమాధానమిచ్చినా కూడా వినిపించుకోకుండా వారం రోజుల కిందట కమ్యూనిటీహాల్‌కు తాళం వేశారు. కాగా వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పిల్లలు స్కూల్‌కు రావడం ప్రారంభించారు. కమ్యూనిటీహాల్‌లో నడుస్తున్న బడికి తాళం కనిపించడంతో బయటే కూర్చుని చదువుకుంటున్నారు.

పోలీసుల జోక్యంతో..

ఈ వ్యవహారంపై విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ ప్రతాప్ నగర్ చేరుకుని కమ్యూనిటీహాల్‌కు తాళం వేసే అధికారం బస్తీ కమిటీ నేతలకు లేదని, ఏదైనా సమస్యలు ఉంటే చట్టపరంగా చూసుకోవాలి తప్ప..పిల్లలను రోడ్డున పడేసే హక్కులేదని తేల్చిచెప్పారు. వెంటనే తాళాలు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడంతో, బస్తీ కమిటీ నేతలు తాళాలు తొలగించారు. రామాలయం ఆవరణలో కమ్యూనిటీహాల్‌ను తాత్కాలికంగా తామే స్కూల్ కోసం ఇచ్చామని, అయితే బస్తీవాసుల అవసరాలకు ఉపయోగించకుండా ప్రైవేటు స్కూల్ ఏర్పాటు చేసి రిజిస్టర్ చేసుకోవడంతోనే తాము తాళాలు వేశామని బస్తీ కమిటీ నేతలు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీతో పాటు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తామని తెలిపారు..

మా భూములను కాంగ్రెస్ నేతలు కబ్జా చేస్తున్నారు

న్యాయం చేయాలంటున్న బాధితులు

ఖైరతాబాద్, జూన్ 13 : వారసత్వంగా వచ్చిన భూములను స్థానికంగా ఉండే కొందరు కాంగ్రెస్ నేతలు కబ్జాకు యత్నిస్తున్నారంటూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ మండలం, వేంపల్లి గ్రామానికి చెందిన బాధితులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు ముప్పిడి భాస్కర్ మాట్లాడుతూ వేంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 374లో నాలుగు గుంటల భూమి ఉందని, అది తన తండ్రి ద్వారా సంక్రమించిందన్నారు. కొంత కాలంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ తమ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని వాపోయాడు. అదే గ్రామానికి చెందిన మరో బాధితుడు మల్లేశ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 299 లో ఎస్సీ కాలనీలో గతంలో ప్రభుత్వం పది గుంటల భూమిని తన తండ్రికి ఇచ్చిందని, వారసత్వంగా ప్రస్తుతం ఆ భూమిని తాను సాగుచేసుకుంటున్నానని తెలిపారు. సత్యనారాయణ తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేశాడని, తన స్థలంలోకి వెళ్లకుండా అనుచరులతో కలిసి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడన్నారు. సీఎం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రక్తదాతలు..ప్రాణదాతలు

- రక్తసేకరణలో మొదటి స్థానంలో నిమ్స్, రెండో స్థానంలో గాంధీ
- రక్తదానంపై పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): ప్రాణాపాయంలో ఉన్నవారికి మనం చేసే గొప్పసాయం ఏదైనా ఉందంటే అది కేవలం రక్తమిచ్చి వారి ప్రాణాలు కాపాడటమే. చాలామంది ప్రమాదాల భారీన పడినప్పుడు సకాలంలో కావాల్సిన రక్తం లభించకపోవడంతో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. అందుకే ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసే వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం మన మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు సైతం ప్రజల్లో రక్తదానం గురించి అనేక క్యాంపులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాయి. అందులో భాగంగా ఏటా జూన్14 న 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' నిర్వహిస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఓ థీమ్‌తో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఈ సారి సైతం..'రక్తదానం చేయండి, భరోసా నివ్వండి, కలిసికట్టుగా ప్రాణాలు కాపాడుదాం' అనే థీమ్‌తో ముందుకు సాగుతుండటం గమనార్హం.

మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఏర్పాటు..

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 296 రక్తనిధి కేంద్రాలు ఉండగా వాటిలో 53 ప్రభుత్వానివే కావడం గమనార్హం. 53 రక్తనిధి కేంద్రాల్లో 26 కేంద్రాలు కాంపోనెంట్ బ్లడ్ సెంటర్లుగా రక్తసేకరణ, పంపిణీ చేస్తుండటం గమనార్హం. హైదరాబాద్ జిల్లాలో నిలోఫర్, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, గాంధీ జనరల్ ఆసుపత్రి, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ, పేట్లబుర్జ్, నాంపల్లి ఏరియా ఆసుపత్రి, ఎంఎన్‌జే, కింగ్‌కోటీ జిల్లా ఆసుపత్రి, నారాయణగూడలోని ఐపీఎం లలో బ్లడ్ బ్యాంక్ సెంటర్లు ఉండగా, రంగారెడ్డిలో కొండాపూర్‌లోని జిల్లా ఆసుపత్రి, షాద్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రి కేంద్రంగా ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో సైతం రెండు కేంద్రాల్లో రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. రక్తనిధి కేంద్రాల్లో నిమ్స్, గాంధీ, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులు ముందు వరసలో ఉండి అవసరమున్న వారికి ఉచితంగా రక్తాన్ని ఇస్తున్నారు. సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న ఎంతో మంది రోగులను చూసి కేఎంసీ విద్యార్థులు చలించిపోయారు. అలాంటివారిలో కనీసం కొంత మంది ప్రాణాలైనా కాపాడాలని తలిచారు. కాకతీయ మెడికల్ కాలేజీలో 2021 బ్యాచ్‌కు చెందిన మెడికల్ విద్యార్థి కందుల లోకేశ్ కుమార్, 2022 బ్యాచ్‌కు చెందిన చల్ల నవనీత్ ఆలోచనల్లోంచి పుట్టిందే మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్. ఈ క్లబ్‌ద్వారా ఇప్పటివరకు 1000 మందికి రోగులకు రక్తదానం చేశారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

18ఏళ్ల పైబడి ఆరోగ్యవంతంగా ఉన్న వారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. మీరిచ్చే రక్తం వల్ల ఓ ప్రాణాన్ని కాపాడిన వారమవుతాం. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అపోహలు లేకుండా ఆరోగ్యవంతంగా ఉంటారు. ముఖ్యంగా యువత ముందుకు రావాలి. ఇతరులకు సైతం అవగాహన కల్పించాలి.

– డాక్టర్ అమర్‌సింగ్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, స్టేట్ బ్లడ్ సెల్స్ అధికారి

కదలిక ఏదీ

(మొదటిపేజీ తరువాయి)

దీనిని కొందరు అధికారులు కూడా బహిరంగంగానే ధ్రువీకరిస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యాధుల బెడద లేని సమయంలోనే ఔషధాల కొరత వేధిస్తుంటే, రానున్న సీజనల్‌ను ఎలా ఎదుర్కొంటారనేది ప్రశ్నార్థంగా మారింది.

టెస్టుల్లేవ్....కేసుల్లేవ్

దేశమంతా కరోనా కేసులు చాపకింద నీరులా నమోదవుతున్నాయి. కానీ గ్రేటర్‌లో మాత్రం కేసులు నమోదు కావడం లేదు. ఇది శుభపరిణామమే. అసలు విషయమేంటంటే అసలు కరోనా టెస్టులు చేస్తే కదా కేసులు బయటపడేది. నగరంలో కరోనా పరీక్షలు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో చేయకపోవడంతో అసలు కేసులు నమోదుపై స్పష్టత లేదు.

క్యా మతలబ్ హై?

(మొదటిపేజీ తరువాయి)

డ్రగ్ స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘాను పెట్టి డ్రగ్స్ రవాణా, డ్రగ్స్ దందాలు, పబ్బులు, ఇతరాత్ర ప్రైవేట్ కార్యక్రమాల్లో డ్రగ్స్ వారే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. బీహార్, రాజస్థాన్ నుంచి గంజాయి చాక్లెట్లు, బంక్‌తో తయారు చేసిన చాక్లెట్లను హైదరాబాద్ శివారు ప్రాంతాలలో తెచ్చి విక్రయిస్తున్న ఘటనలున్నాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపించిన ఘటనలున్నాయి. అయితే తాజాగా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఇద్దరు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చట్టప్రకారం నడుచుకున్నాం

బంగ్‌తో తయారు చేసిన చాక్లెట్లు పట్టుకున్నాం. బీహార్ నుంచి అవి వచ్చినట్లు గుర్తించాం. అవి గంజాయి చాక్లెట్లు అని ప్రచారం జరిగింది. మా వాళ్లు కూడా గంజాయి చాక్లెట్లు అని చెప్పారు. అయితే అవి బంగ్‌తో తయారు చేసిన చాక్లెట్లు. అవి తక్కువ పరిమాణంలో ఉండడంతో ఆ కేసులో శిక్షలు 7 సంవత్సరాల లోపే ఉండే సెక్షన్లు ఉన్నాయి. 7 సంవత్సరాల లోపు శిక్షలు పడే కేసులో కోర్టులు రిమాండ్‌లు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఆ కేసులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి వచ్చింది. మాపై వచ్చిన ఆరోపణలు నిరాధరమైనవి. చట్ట ప్రకారమే అంతా నడుచుకున్నాం.

– హయత్‌నగర్ సీఐ, నాగరాజుగౌడ్